# దశ

WWW.DASHANEWS.COM
శనివారం
09 08 2025
సంపుటి 1 సంచిక 101
పేజీలు : 02
UDYAM / TS-09-0148996

నిజం.. నిర్భయంగా..

## చరిత్రలో ఈ రోజు



1776: ఇటాలియన్ శాస్త్రవేత్త అమెడియో అవోగాడ్రో జననం (మ.1856).
1994: అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం
1910: పద్మశ్రీ అవార్డు పొందిన మొదటి హాస్యనటుడు రేలంగి వెంకట్రామయ్య జననం (మ.1975).
1932: తెలుగు రచయిత జాలాది రాజారావు జననం (మ.2011).
1942: క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైంది.
1945: జపాన్ లోని నాగసాకి పట్టణముపై అమెరికా అణుబాంబు ప్రయోగించింది. (చిత్రంలో)



1948: భారత వైద్య శాస్త్రజ్ఞుడు యల్లాప్రగడ సుబ్బారావు మరణం
1975: తెలుగు సినిమా నటుడు ఘట్టమనేని మహేశ్ బాబు జననం.
1992: క్విట్ ఇండియా ఉద్యమం స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకుని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒక రూపాయి స్మారక నాణాన్ని విడుదల చేసింది.

# డ్రగ్స్ బానిసల్లో డాక్టర్లు

### ఒకే కాలేజీకి చెందిన 32 మంది గుర్తింపు

### సీరియస్‌గా తీసుకున్న అధికారులు... దర్యాప్తు ముమ్మరం




**దశ, హైదరాబాద్:** వైద్యో నారాయణో హరి అన్నారు..! అంటే వైద్యుడు దేవుడితో సమానం. సమాజంలో డాక్టర్‌కు అంతటి హోదానిచ్చాం మనం. కానీ వరుస ఘటనలు వైద్య వృత్తికే మచ్చ తెచ్చేలా ఉన్నాయి. గతకొన్ని రోజులుగా డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతూ వందలాది మందిని అరెస్ట్ చేసిన ఈగల్ టీమ్.. పక్కా సమాచారంతో మెడిసిటీ మెడికల్ కాలేజీపై ఫోకస్ పెట్టింది. ఆ కాలేజీకి డ్రగ్స్ ఎలా వెళ్తున్నాయి..? ఎవరు తీసుకెళ్తున్నారు..? అంటూ నిఘా పెట్టి పలువురిని అరెస్ట్ చేయడంతో పాటు షాకింగ్ విషయాలు వెల్లడించారు అధికారులు. లేటెస్ట్‌గా ఈగల్ టీమ్‌కి దొరికిన డాక్టర్స్ డ్రగ్స్ డైరీ షాక్‌కి గురిచేస్తోంది. అటు పెడ్లర్ల లావాదేవీలు చూసి అధికారులే అవాక్కయ్యారు.జరీనాభాను, అర్బాత్ ఖాన్.. ఇద్దరు డ్రగ్స్ పెడ్లర్లను పట్టుకున్నారు ఈగల్ టీమ్ అధికారులు. ఆ ఇద్దరి ఫోన్ కాల్స్, యూపీఐ ట్రాన్సాక్షన్‌ను ట్రాక్ చేసి 100 మంది డ్రగ్స్ కన్జూమర్స్‌ను పట్టుకున్నారు. ఆ వందమందిలో 32మంది మెడిసిటీ కాలేజీకి చెందిన మెడికోలు ఉండటం షాక్‌కు గురిచేస్తోంది. ఆ ముప్పై రెండు మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. తొమ్మిది మందికి పాజిటివ్ వచ్చింది. పాజిటివ్ వచ్చినవారిలో

..మిగతా 2వ పేజీలో ➔



## సాయంత్రంలోగా చంపేస్తాం ..

మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావుకు మరోసారి బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. హైదరాబాద్‌లోనే ఉన్నాం.. సాయంత్రంలోగా చంపేస్తామని ఎంపీని గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించారు. ఈ నేపథ్యంలో రఘునందన్ రావు భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. రఘునందన్ రావుకు బెదిరింపు ఫోన్ కావడం ఇది ఆరోసారి. మెదక్ ఎంపీకి 9404348431 నుంచి బెదిరింపు కాల్ వచ్చినట్లు పేర్కొన్నారు.

**దశ, హైదరాబాద్**



## ఫిరాయింపుల పై స్పీకర్ కీలక వ్యాఖ్యలు

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత విషయంలో, సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి చర్యలు తీసుకుంటున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. అక్టోబర్ 31,2025లోపు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు పంపించామని వారు సమయం కావాలని కోరినట్టు తెలిపారు.

**దశ, హైదరాబాద్**



## లైంగిక సమ్మతి వయసు 18 ఏళ్లు తప్పనిసరి..

లైంగిక చర్యలకు సమ్మతి వయసు 18 ఏళ్లు కంటే తక్కువ చేయడం ప్రమాదకరమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పష్టం చేసింది. 16 ఏళ్లకు తగ్గించాలని సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ చేసిన వాదనను కేంద్రం తోసిపుచ్చింది. అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి తెలిపిన ప్రకారం, ఈ పరిమితి తగ్గితే బాలలపై నేరాలు, అక్రమ రవాణా పెరిగే ప్రమాదం ఉంది. పోక్సో చట్టం కౌమారదశలో ఉన్నవారి రక్షణకే ఉద్దేశించినదని, వయోపరిమితి తగ్గించడం చట్టవ్యతిరేకమని కేంద్రం పేర్కొంది. ఇందిరా జైసింగ్ అభిప్రాయం ప్రకారం, ప్రస్తుత చట్టం 16, 18 ఏళ్ల మధ్య ఏకాభిప్రాయ ప్రేమ సంబంధాలను నేరంగా చూపుతుందని, ఇది కౌమారదశ యువత హక్కులను ఉల్లంఘిస్తోందని తెలిపారు. లా కమిషన్, పోక్సో చట్టం ప్రకారం 18 ఏళ్లు సమ్మతి వయసుగా కొనసాగించడమే సరైందని గతంలోనే స్పష్టం చేసింది.

**దశ, న్యూఢిల్లీ**

# భారీ ర్యాలీతో సిట్ విచారణకు బండి

### ప్రతి క్షణం నా ఫోన్‌ను ట్యాప్ చేశారు.

### " సిట్ అధికారులు పిలిచారు...వెళుతున్నా, నా దగ్గరున్న సమాచారాన్ని సిట్‌కు అందజేస్తా.. బాధ్యత గల పౌరుడిగా వెళుతున్నా.....



**దశ, హైదరాబాద్:** తెలంగాణలో సంచలనంగా మారుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇచ్చేందుకు కేంద్రమంత్రి బండి సంజయ్ సిట్ ముందు హాజరయ్యారు. గతంలోనే ఆయనకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. వాటిపై స్పందించిన ఆయన ఆగస్టు 8న విచారణకు హాజరవుతానని సమాచారం ఇచ్చారు. చెప్పినట్టుగానే ఇవాళ భారీ హంగామాతో విచారణకు హాజరయ్యారు. ఇంటి నుంచి సిట్ విచారణకు బయల్దేరిన బండి సంజయ్ ఖైరతాబాద్ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో ఫాలో అయ్యేందుకు భారీగా జన సమీకరణ చేశారు. పూజలు అనంతరం అక్కడి నుంచి పాదయాత్రగా దిల్‌కుషా గెస్ట్‌హౌస్ వరకు వచ్చారు. ఆయనతోపాటు బీజేపీ కార్యకర్తలు నడిచారు. పాదయాత్రలో పాల్గొన్న బీజేపీ నేతలు,కార్యకర్తలు,కాంగ్రెస్,బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు జాతీయ సమస్య అని దాని దర్యాప్తును సీబీఐకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్ర వేళ భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఇంటి నుంచి సిట్ దర్యాప్తునకు బయల్దేరుతున్నటైంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. "సిట్ అధికారులు పిలిచారు...వెళుతున్నా, నా దగ్గరున్న సమాచారాన్ని సిట్‌కు అందజేస్తా. బాధ్యత గల పౌరుడిగా వెళుతున్నా, సిట్ విచారణపై నాకు నమ్మకం లేదు. ఆధారాలున్నా కేసీఆర్ కుటుంబంలో ఒక్కరిని కూడా అరెస్ట్ చేయకపోవడమే దీనికి నిదర్శనం. ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందనే విషయాన్ని మొట్టమొదట బయటపెట్టింది నేనే. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రతి క్షణం నా ఫోన్‌ను ట్యాప్ చేశారు. మిగిలిన విషయాలు సిట్ విచారణ అనంతరం మాట్లాడతా" అని చెప్పుకొచ్చారు.



# రామచంద్రరావుతో గువ్వల భేటీ..

### బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటన ..





**దశ, హైదరాబాద్:** బీఆర్ఎస్‌కు ఈ మధ్య రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీలో చేరుతున్నట్టు ప్రకటించారు. ఈ ఉదయం ఆయన బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావుతో సమావేశమయ్యారు.అనంతరం ఈ విషయాన్ని ప్రకటించారు. సన్నిహితులు అనుచరులతో చర్చించిన తర్వాత కమలం కండువా కప్పుకోవాలని నిర్ణయించుకున్నట్టు బాలరాజు తెలిపారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన తర్వాత అచ్చంపేట నియోజకవర్గంలో అనుచరులతో సమావేశమయ్యారు. ఎందుకు గులాబీ పార్టీకి రాజీనామా చేశారో వారికి వివరించారు. చాలా కాలంగా బీఆర్ఎస్ అవమానాలు ఎదుర్కొన్నట్టు బాలరాజు ఆరోపించారు.

గువ్వల బాలరాజు 2007లో బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి పార్టీకి పూర్తి కమిట్‌మెంట్‌తో పని చేశారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. అందుకే 2009లో నాగర్‌కర్నూలు నుంచి లోక్‌సభ స్థానానికి అప్పటి బీఆర్ఎస్ తరపున పోటీ చేసి ఓడిపోయారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత 2014, 2018లో అచ్చంపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గత ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ తర్వాత నుంచి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంచారు. ఇప్పుడు సడెన్‌గా బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడంతో అంతా షాక్ అయ్యారు.

# అమృత్ 2.0 ద్వారా

## త్రాగునీటి పంపిణీకి చర్యలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**దశ, మంచిర్యాల జిల్లా ప్రతినిధి :** అమృత్ 2.0 పథకంలో నీటి ట్యాంకు నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూరు పట్టణంలో కొనసాగుతున్న అమృత్ 2.0 నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మిషన్ భగీరథ పథకంలో ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా త్రాగునీటిని అందించడం జరుగుతుందని, ఈ క్రమంలో ప్రజలకు ఎలాంటి నీటి సమస్య లేకుండా అమృత్ 2.0 పథకం ద్వారా త్రాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ పథకం లో భాగంగా చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## వాగులో కొట్టుకుపోయిన కారు

**దశ, యాదాద్రి:** చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి ఈదుల వాగులో షిఫ్ట్ కారు కొట్టుకుపోయింది. ప్రమాద సమయంలో కారు లో ఏడుగురు ప్రయాణికులు వున్నారు. కారు వాగు మధ్యలో వెళ్లిన తర్వాత వరద ఉధృతంగా రావడం తో వారంతా కార్ దిగి ప్రాణాలను రక్షించుకున్నారు. వర్కట్పల్లి గ్రామం లో ఈరోజు ఉదయం ఏడు గంటల సమయంలో ఇంట్లో పెళ్లి శుభకార్యం ఉండడంతో రాత్రి 9 గంటలకు వర్షం పడుతున్న వాగు దాటే ప్రయత్నం చేయడంతో భారీ వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తున్న ఈదుల వాగులో ఘటన జరిగింది.



మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలలో పాల్గొన్న మహిళలు

**దశ, మంచిర్యాల**



# మూసీ, బిక్కేరు వాగుల్లో జలకళ – రైతుల్లో ఉత్సాహం

**దశ, అడ్డగూడూర్:** గత రెండు రోజులుగా హైదరాబాదు, పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో మూసీ, బిక్కేరు వాగులు జలకళను సంతరించుకున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో నదులు, వాగులు ఉప్పొంగుతున్నాయి. నల్గొండ జిల్లా అమ్మనబోలు, యాదాద్రి భువనగిరి జిల్లా పొడిచేడు గ్రామాల మధ్య ఉన్న మూసీ వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తూ, చుట్టుపక్కల ప్రాంతాల చెరువులు, కుంటలను నింపుతోంది. వర్షాల ప్రభావంతో వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలు పూర్తిగా నిండిపోయాయి. బిక్కేరు వాగులో గణనీయంగా నీటి ప్రవాహం పెరగడం గమనార్హం. వాగుల జలకళలను చూస్తూ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు నీరు అందుబాటులోకి రావడంతో ఈ ఖరీఫ్ పంటకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందనే నమ్మకం రైతుల్లో నెలకొంది. ఈ వరదనీటి ప్రవాహం వల్ల బిక్కేరు వాగు నీటితో నిండిపోవడం వల్ల నీటి మట్టం పెరిగి ఆయకట్టు ప్రాంతాలకు నీటి ఎద్దడి తగ్గుతుంది దీనివల్ల బిక్కేరు వాగు వెంబడి ఉన్న గ్రామాలకు సాగు, త్రాగునీరు కష్టాలు తీరినట్టే అని రైతులు సంతోషపడుతున్నారు.

# ఆధారాలివ్వు.. లేదంటే క్షమాపణ చెప్పు..

## రాహుల్‌గాంధీ ఆరోపణలకు ఈసీ కౌంటర్

**దశ, న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయని, అధికార బీజేపీ కోసం ఎన్నికల సంఘం ఓట్ల చోరీకి పాల్పడుతోందని రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై భారత ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. రాహుల్ వ్యాఖ్యలను అర్థం పర్థం లేనివిగా అభివర్ణించింది. రాహుల్‌గాంధీ తన ఆరోపణలకు కట్టుబడి ఉంటే తన సంతకంతో ప్రమాణపూర్వకంగా ఫిర్యాదు చేయాలని, లేనిపక్షంలో దేశానికి క్షమాపణ చెప్పాలని ఎన్నికల సంఘం కౌంటర్ ఇచ్చింది. గురువారం సాయంత్రం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో రాహుల్ గాంధీ ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది.









# ఘనంగా వరలక్ష్మీ వ్రత పూజలు

**దశ, పెద్ద అంబర్పేట :** వరలక్ష్మీ వ్రత పూజలు శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు కుటుంబాల యజమానులు ఆయా కాలనీలో వాసుల మహిళలతో ప్రత్యేక వ్రతాలు నిర్వహించారు. సహస్రనామాలతో సుఖశాంతులతో కుటుంబాలు ఉండాలని కోరుతూ మహిళలు పెద్ద ఎత్తున పూజలు చేశారు. పలు రకాల పూజ వంటలతో దేవుళ్లకు సమర్పించారు.



# ధోబీ ఘాట్లను పునరుద్ధరించండి

## బీజేపీ నాయకులు పిల్లి శ్రీనివాస్ యాదవ్

**అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 08:** మరుగున పడిన ధోబీఘాట్లను వెంటనే పునరుద్ధరించాలని బీజేపీ పార్టీ నాయకులు పిల్లి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పట్టణ పరిధిలోని చాకిరేవు వద్ద ఉన్న ధోబీఘాట్లు శిథిలావస్థలో ఉన్నాయని.. వాటిని వెంటనే పునరుద్ధరించాలని మున్సిపల్ ఆఫీసులో శుక్రవారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం పిల్లి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ధోబీఘాట్లు చెడిపోవడం వలన రజకులు తమ వృత్తిని కొనసాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటి స్థానంలో కొత్త ధోబీ ఘాట్లను మంజూరు చేయాలన్నారు. అదే విధంగా స్నానాల గదులు, మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు ముదిగొండ రమేష్, నాయకులు హరిబాబు, ఈశ్వరయ్య, కుమార్, శ్యామ్, మల్లేష్‌తో పాటు పలువురు స్థానికులున్నారు.



# సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలి: కలెక్టర్ కుమార్ దీపక్

**దశ, మంచిర్యాల జిల్లా ప్రతినిధి :** వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నియంత్రించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి తో కలిసి సందర్శించి మందుల నిల్వలు, వార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. బొప్పారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధి పొందిన వారు ఇండ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలని, నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. సర్వాయిపేట గ్రామంలో పర్యటించి పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా వ్యవస్థను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మండల తహసిల్దార్ రాఘవేంద్ర తో కలిసి సందర్శించి వంటశాల, తరగతి గదులు, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, మూత్రశాలలు, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రాఖీ పండుగ (రక్షాభంధనం)

అది రక్త సంబంధముతో
బంధం బలపడడానికి
భరోసా ఇవ్వడానికి

తోబుట్టువులకు
వరసైన వారికితో
కష్ట, సుఖాలలో కలిసి
ఉంటామని
అన్ని వేళల ఆదుకుంటామని

సౌభాగ్యంగా వుండాలని
సకల సంపదలు కలగాలని
సన్నిహితంగా మెలగాలని
సంతోషంగా జీవితం గడపాలని

అన్నా, తమ్ముళ్లు
ఆత్మీయంగా వుండి ఎదగాలని
అక్కా చెల్లెల్లకు
అండగా ఉంటామని

పురాణ గాధలను తలపిస్తు
జరుపుకొనే వేడుక
విజయాలను కాంక్షిస్తు
చేసుకొను పండుగ

ప్రతి ఇంట జరుపుకోవాలి
బంధుత్వాలను కొనసాగించాలి
ఒకరికి ఒకరు తోడుగా ఉండాలి
ఒంటరి భావన విడనాడాలి

రచన:
కడెం. ధనంజయ, చిత్తలూర్

# ఘనంగా సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు




దశ, మంచిర్యాల జిల్లా ప్రతినిధి : జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్ లో గల తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పోరాటయోధుడు రజాకర్ల నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన సింహ స్వప్నం సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ సాయన్న జయంతిని, వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని, అలాగే హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పై సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, సీనియర్ నాయకులు తులా మధుసూదన్, శాఖపూరి భీమ్సేన్, గజ్జెల్లి వెంకటయ్య, చంద్రగిరి చంద్రమౌళి, అశోక వేముల, అంకం సతీష్, ఆరెందుల రాజేశం, కీర్తి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

# సృష్టి కేసులో మరో ఇద్దరి అరెస్ట్

**దశ, హైదరాబాద్**

సికింద్రాబాద్ సృష్టి ఫెర్టిలిటీ కేసులో రోజుకో సంచలన విషయం వెలుగులోకి వస్తుంది, ఇప్పటికే ఈ కేసులో అరెస్టు అయిన వారి సంఖ్య 24 కు చేరింది. తాజాగా ఈ కేసులో విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ కేజీహెచ్,కు చెందిన ఇద్దరు వైద్యులను గోపాలపురం పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ వాసుపల్లి రవి కుమార్, ప్రసూతి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉషాదేవి ఉన్నారు. ఇక వాసుపల్లి రవి కుమార్ మాజీ ఎమ్మెల్యే తమ్ముడు కావడంతో ఈ కేసులో మరో రాజకీయ కోణాన్ని తీసుక రాబోతుంది. ఇదివరకు ఇదే కేసులో అరెస్టయి, బెయిల్ పై విడుదలైన డాక్టర్ విద్యాలత కూడా కేజీహెచ్ పిల్లల విభాగంలో పనిచేశారు. ఈ వైద్యులు కేజీహెచ్‌లో విధులు నిర్వహిస్తూనే 'సృష్టి' ఫెర్టిలిటీ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించేవారని ఆరోపణలు ఉన్నాయి.

# జైపూర్ పోలీస్, జిల్లా షీ టీం ఆధ్వర్యంలో రక్షా బంధన్ వేడుకలు



**దశ, మంచిర్యాల జిల్లా ప్రతినిధి :** జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో గల కేజీబీవీ లో శుక్రవారం జైపూర్ పోలీస్, జిల్లా షీ టీం ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం జిల్లా షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినీలకు షీ టీం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం జిల్లా ఇంచార్జ్ ఎస్ఐ హైమ మాట్లాడుతూ, మహిళలు, పిల్లలకు భద్రత, భరోసా కల్పించడం కోసమే షీ టీం పనిచేస్తుందని తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ సేవించిన, మహిళలను వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడిన, ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 లేదా రామగుండం షీ టీమ్ నెంబర్ 6303923700 కు ఫిర్యాదు చేయాలని, వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏఎస్ఐ బాలయ్య, జిల్లా షీ టీమ్ కానిస్టేబుల్ లు శ్రావణ్, జ్యోతి, శ్రీలత, జైపూర్ పోలీస్ సిబ్బంది, పాఠశాల ఎస్ఓ ఫణిబాల, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అడ్డగూడూరు అభివృద్ధికి సిపిఐ పోరాటం:యానాల




**దశ,అడ్డగూడూరు:** అడ్డగూడూరు మండల సమగ్ర అభివృద్ధికై సిపిఐ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సీపీఐ కార్యదర్శి రేకల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలానికి సొంత కార్యాలయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పునాది కాలువను పూర్తి చేసి ధర్మారం వరకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సహాయ కార్యదర్శులు సత్యనారాయణ, చెడే చంద్రయ్యలు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉప్పుల శాంతి కుమార్, మండల కౌన్సిల్ సభ్యులు కందుకూరి వెంకన్న, బొనుగసుదర్శన్ రెడ్డి, బెల్లి శ్రీకాంత్, సోలిపురం నాగిరెడ్డి, చెడే సుందరయ్య, శీలం వెంకన్న, తీగల సైదులు, మార్త వీరయ్య, ఉప్పుల శివచారి తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్, ఆదిభట్ల పురపాలక సంఘం మధ్య శుక్రవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. అందులో తుర్కయంజాల్ పురపాలక సంఘం ఘనవిజయం సాధించింది. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్ పేట, తుర్కయంజాల్, ఆదిభట్ల కమిషనర్లు రవీందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దశ, తుర్కయంజాల్



# డ్రగ్స్ బానిసల్లో డాక్టర్లు

మొదటి పేజీ తరువాయి

ఇద్దరు మహిళా డాక్టర్లు ఉన్నట్లు తేల్చారు. ఈగల్ టీమ్‌కి దొరికిన ఇద్దరు పెడ్లర్లు మామూలోళ్లు కాదు..! అర్ఫాత్‌ఖాన్, జరీనాభానును అరెస్ట్ చేసిన అధికారులు విస్తుపోయే వాస్తవాలు వెల్లడించారు. అర్ఫాత్‌ఖాన్ దగ్గర నుంచి 6కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జరీనాభాను అకౌంట్ నుంచి జరిగిన ట్రాన్సాక్షన్స్ చూసి అధికారులే షాక్ అయ్యారు. కోటి యాభై లక్షల రూపాయల లావాదేవీలను గుర్తించారు. అందులో 26 లక్షల రూపాయలు హైదరాబాద్‌కు చెందిన డీలర్స్ నుంచి వచ్చినట్లు తెలిపారు. డ్రగ్స్ సరఫరా, ఆర్థిక లావాదేవీలు అటుంచితే... ముంబై, గోవా నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు వెల్లడించారు అధికారులు. ఈ ఇద్దరికి సుమారు 100మంది డ్రగ్స్ డీలర్లతో లింకులున్నట్లు గుర్తించారు. అందులో 51మంది హైదరాబాద్‌లో ఉన్నట్లు తేల్చారు. వాళ్లను పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందినవాళ్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదంటున్నారు. మొత్తంగా... మెడిసిన్ వెళ్లాల్సిన మెడికల్ కాలేజీకి డ్రగ్స్ వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది..! ఒకే కాలేజీకి చెందిన 32 మంది మెడికోలు డ్రగ్స్‌కు బానిసవ్వడం షాక్‌కి గురిచేస్తోంది. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దొరికిన ఇద్దరు పెడ్లర్లతో లింక్స్ ఉన్న ఏ ఒక్కరినీ వదిలేదే లేదంటున్నారు.